Dr. Sravan Kumar Dasoju
MLC
Telangana Legislative Council

H. No: 46, Aditya Empress Park
Shaikpet, Hyderabad - 500008
Mobile No: +91 9885039384

తేదీ: 22 నవంబర్ 2026

గౌరవనీయులైన శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి,
ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రి,
తెలంగాణ ప్రభుత్వం,
డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం, హైదరాబాద్.

విషయం: ఇంటర్మీడియట్ రద్దు చేసి 9 నుండి 12వ తరగతిని ఒకే బడిగా మారిస్తే, ఇతర రాష్ట్రాల విద్యార్థులు సులభంగా తెలంగాణ లోకల్ హోదా పొంది, మన విద్యార్థుల మెడికల్, ఇంజనీరింగ్ సీట్లను దక్కించుకునే ప్రమాదం ఉంది; కార్పొరేట్ విద్యాసంస్థలకు లాభం చేకూర్చే ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి - రిజిస్టర్.
సూచిక: ఇంటర్మీడియట్ రద్దుపై 13 నవంబర్ 2026న నేను రాసిన బహిరంగ లేఖ.

గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు ,
ఇంటర్మీడియట్ వ్యవస్థ రద్దు చేయాలనే మీయీ తప్పుడు నిర్ణయంపై 13 నవంబర్ 2026న నేను మీకు బహిరంగ లేఖ రాశాను. ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులతో కనీస చర్చ లేకుండా తీసుకున్న ఈ నిర్ణయం వెనుక **కార్పొరేట్ కాలేజీల ప్రయోజనాలు** ఉన్నాయని ప్రజలు అనుమానిస్తున్నారని అందులో **స్పష్టం చేశాను.**

వారం గడిచినా మీ ప్రభుత్వం నుండి "నిమ్మకు నీరెత్తినట్లు" ఒక్క సమాధానం కూడా రాలేదు. ఈ రోజు అంతకంటే తీవ్రమైన, తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును శాశ్వతంగా దెబ్బతీసే చట్టపరమైన ప్రమాదాన్ని మీ దృష్టికి తెస్తున్నాను.

> ***తెలంగాణలో 'లోకల్ హోదా' రావాలంటే 9 నుండి 12వ తరగతి వరకు వరుసగా నాలుగేళ్లు ఇక్కడే చదవాలి. మీరు ఇప్పుడు సరిగ్గా ఆ నాలుగేళ్ల చదువునే ఒకే గొడుగు కిందకు (9 నుండి 12 ఇంటిగ్రేటెడ్ స్కూల్) తెస్తున్నారు. ఇది అమలైతే, నాలుగేళ్ల కార్పొరేట్ హాస్టల్ ప్యాకేజీ కొనుక్కున్న ఏ రాష్ట్ర విద్యార్థి అయినా చట్టబద్ధంగా 'తెలంగాణ లోకల్' అయిపోతాడు.***

ఈ నిర్ణయం మన బిడ్డల సీట్లకు ఎలా ఎసరు పెడుతుందో వాస్తవ ఆధారాలతో, దశలవారీగా వివరిస్తున్నాను:

1. చట్ట రీత్యా తెలంగాణ లోకల్ హోదా ఎలా నిర్ణయించబడుతుంది?

తెలంగాణలో లోకల్ హోదా **పుట్టుకతోనో, స్థానిక చిరునామాతోనో రాదు.** ప్రవేశ పరీక్ష (Entrance Exam) రాసే ఏడాదికి ముందు, **వరుసగా నాలుగేళ్లు ఎక్కడ చదివారు** అనేదాని

ఆధారంగానే వస్తుంది. ముఖ్యంగా మెడికల్ (MBBS, BDS) సీట్లకు **9, 10, 11, 12 తరగతులు** ఇక్కడే చదివి ఉండాలి.

చట్టం / ప్రభుత్వ ఉత్తర్వు (GO)	అందులోని ప్రధాన నిబంధన
రాజ్యాంగం ఆర్టికల్ 371(D)	విద్యా, ఉద్యోగ అవకాశాల్లో స్థానిక విద్యార్థులకు ప్రత్యేక రాజ్యాంగ రక్షణ.
రాష్ట్రపతి ఉత్తర్వులు, 1974	ఎంట్రన్స్ రాసే నాటికి ముందు వరుసగా 4 ఏళ్లు స్థానికంగా చదివినవారే 'లోకల్'.
ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 95	పదేళ్ల ఉమ్మడి అడ్మిషన్ల గడువు 2 జూన్ 2024తో ముగిసింది.
జీవో ఎంఎస్ నం. 33 (19 జూలై 2024)	**MBBS, BDS సీట్లకు 9 నుండి 12వ తరగతి వరకు తెలంగాణలోనే చదివి ఉండాలి.**
జీవో ఎంఎస్ నం. 15 (27 ఫిబ్రవరి 2025)	అన్ని కోర్సుల్లో 85% సీట్లు తెలంగాణ లోకల్ విద్యార్థులకే; 15% నాన్-లోకల్ కోటా రద్దు.

ఈ నాలుగేళ్ల నిబంధనను కాపాడుకోవడానికి **మీ ప్రభుత్వమే సుప్రీంకోర్టుకు వెళ్లి 1 సెప్టెంబర్ 2025న విజయం సాధించింది. లోకల్ నిర్వచనాన్ని సడలిస్తే ఆర్టికల్ 371(D) ఉద్దేశమే దెబ్బతింటుందని సర్వోన్నత న్యాయస్థానం కూడా స్పష్టం చేసింది.**

2. ప్రస్తుతం ఉన్న వ్యవస్థ మన బిడ్డలను ఎలా కాపాడుతోంది?

ప్రస్తుతం 9 నుండి 12వ తరగతి వరకు ఉన్న నాలుగేళ్ల చదువు **రెండు వేర్వేరు దశలుగా, రెండు వేర్వేరు బోర్డుల పరిధిలో** ఉంది:

- **మొదటి దశ (9, 10 తరగతులు):** పాఠశాలలో చదివి, పదో తరగతి (SSC) బోర్డు పరీక్షతో పూర్తి చేస్తారు.
- **రెండో దశ (11, 12 తరగతులు):** జూనియర్ కాలేజీలో చేరి, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు పరీక్ష రాస్తారు.

ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వేలాది మంది విద్యార్థులు పదో తరగతి వరకు తమ సొంత ఊళ్లలోనే చదివి, **కేవలం ఇంటర్మీడియట్ (2 ఏళ్లు) కోసమే** హైదరాబాద్‌కు వస్తారు. ఇక్కడ వారి చదువు రెండేళ్లే కాబట్టి, చట్టప్రకారం వారు **'నాన్-లోకల్'** గానే పరిగణించబడతారు. ఫలితంగా మన 85% లోకల్ సీట్లు తెలంగాణ బిడ్డలకే సురక్షితంగా దక్కుతున్నాయి.

పదో తరగతి తర్వాత స్కూల్ నుండి జూనియర్ కాలేజీకి మారే ఈ విరామమే, మన పిల్లల సీట్లకు, వారి స్థానికతకు సహజమైన రక్షణ కవచం.

3. ఇంటర్ రద్దు చేస్తే జరిగే పెను ప్రమాదం ఏమిటి?

ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి, 9 నుండి 12వ తరగతిని ఒకే **"సీనియర్ సెకండరీ స్కూల్"**గా మారిస్తే, పదో తరగతి తర్వాత ఉండే ఆ విరామం పూర్తిగా మాయమవుతుంది. చదువు సహజంగానే 9వ తరగతి నుండి మొదలయ్యే **నాలుగేళ్ల సమీకృత కోర్సు (Integrated Course)** గా మారిపోతుంది.

- **కార్పొరేట్ ప్యాకేజీల దందా:** రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృత నెట్‌వర్క్ ఉన్న నారాయణ, శ్రీ చైతన్య, మరియు మీ ప్రభుత్వ పెద్దల ప్రాపకం వల్ల పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు, హైదరాబాద్ క్యాంపస్‌లలో **"9 నుండి 12వ తరగతి వరకు నాలుగేళ్ల రెసిడెన్షియల్ ప్యాకేజీ + NEET/JEE కోచింగ్"** పేరుతో అడ్మిషన్లు మొదలుపెడతాయి.
- **9వ తరగతి నుంచే వలస:** ఇప్పటివరకు ఇంటర్ కోసం వచ్చిన ఇతర రాష్ట్రాల విద్యార్థులు, ఇకపై లోకల్ హోదా కోసం **9వ తరగతి నుంచే** హైదరాబాద్ హాస్టళ్లలో చేరతారు.
- **దొడ్డిదారిన లోకల్ హోదా:** నాలుగేళ్లు పూర్తయ్యేసరికి వారికి తెలంగాణలో వరుసగా నాలుగేళ్ల చదువు ఉన్నట్లు రికార్డులు సిద్ధమవుతాయి. **చట్టం ప్రకారం వారు 'తెలంగాణ లోకల్' అయిపోతారు.**
-

ఈ మార్పు వల్ల మన విద్యార్థికి జరిగే నష్టాన్ని ఈ పట్టికలో స్పష్టంగా చూడండి:

అంశం	ప్రస్తుత విధానం (ఇంటర్ ఉన్నప్పుడు)	మీ నిర్ణయం తర్వాత (9 నుండి 12 ఒకే బడి అయితే)
విజయవాడ విద్యార్థి	10వ తరగతి వరకు విజయవాడలో; ఇంటర్ మాత్రమే హైదరాబాద్‌లో (2 ఏళ్లు).	9వ తరగతి నుంచే హైదరాబాద్ కార్పొరేట్ హాస్టల్‌లో (వరుసగా 4 ఏళ్లు).
చట్టపరమైన హోదా	నాన్-లోకల్ (మన 85% సీట్లకు అర్హత లేదు).	తెలంగాణ లోకల్ (మన 85% సీట్లకు పూర్తి అర్హత).
ఆదిలాబాద్ విద్యార్థి (మన బిడ్డ)	**అదే ర్యాంకుతో గాంధీ / ఉస్మానియాలో MBBS సీటు వస్తుంది.**	**అదే ర్యాంకు వచ్చినా సీటు కోల్పోతాడు; ఆ సీటు విజయవాడ విద్యార్థికి దక్కుతుంది.**

రాష్ట్రంలో మెడికల్, ఇంజనీరింగ్ సీట్లు పెరగవు. కానీ **బయటి నుండి 'లోకల్' ముద్రతో వచ్చే ప్రతి ఒక్కరూ, మన తెలంగాణ బిడ్డకు దక్కాల్సిన ఒక సీటును తన్నుకుపోతారు.** **నేడు అరుదుగా ఉన్న ఒక చట్టపరమైన వెసులుబాటును, మీ నిర్ణయం ఒక పెద్ద వ్యాపార రాజమార్గంగా మారుస్తోంది. మీ స్వార్థ పూరిత నిర్ణయం, కోట్లాది తెచ్చుకున్న తెలంగాణ లక్ష్యాలపై దాడి చేస్తున్నటుంది. ఇది ముమ్మాటికి ఈ ప్రాంత విద్యార్థులకు మీ ప్రభుత్వం చేసే మోసం, దగా.**

తెలంగాణ లోకల్ హౌదా అనేది నాలుగేళ్ల కార్పొరేట్ హాస్టల్ ప్యాకేజీలో అమ్ముడుపోయే ఒక సరుకుగా మారిపోతుంది.

4. ఆంధ్రప్రదేశ్ తలుపులు మూసుకుంది; మీరు మన తలుపులు తెరుస్తున్నారు

ఉమ్మడి అడ్మిషన్ల గడువు ముగియగానే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం **2025-26 విద్యాసంవత్సరం నుండి 15% నాన్-లోకల్ కోటాను పూర్తిగా రద్దు చేసి,** సీట్లన్నీ తమ రాష్ట్ర విద్యార్థులకే దక్కేలా కట్టుదిట్టం చేసుకుంది. మన తెలంగాణ కూడా **27 ఫిబ్రవరి 2025న జీవో 15** తెచ్చి ఆంధ్ర విద్యార్థుల 15% కోటాను రద్దు చేసింది.
ముందు తలుపు మూసి, ఇప్పుడు వెనుక తలుపు బార్లా తెరుస్తారా? నాన్-లోకల్ కోటాలో రాకుండా ఆపిన వారినే, ఇప్పుడు లోకల్ హౌదా కట్టబెట్టి మన 85% సీట్లలోకి ఆహ్వానిస్తారా? **ఇది మీ ప్రభుత్వమే తెచ్చిన జీవో 15 స్ఫూర్తిని మీరే నీరుగార్చడం కాదా?**

5. ఇంటర్ బోర్డు రద్దుతో ప్రమాదంలో స్టడీ సర్టిఫికెట్ల విశ్వసనీయత

ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలను మన రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని **తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు** నిర్వహిస్తోంది. 9 నుండి 12 తరగతులను విలీనం చేస్తే ఏ బోర్డు పరీక్షలు నిర్వహిస్తుంది? CBSE, NCERT సిలబస్‌ల పేరుతో ప్రైవేటు పాఠశాలలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తారా? అనే విషయంలో మీ ప్రకటనలో స్పష్టత లేదు.
సీనియర్ సెకండరీ విద్య జాతీయ బోర్డుల పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థల చేతుల్లోకి వెళితే, లోకల్ హౌదాకు కీలకమైన **'స్టడీ సర్టిఫికెట్ల' జారీ పూర్తిగా ప్రైవేటు యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై** ఆధారపడుతుంది. **ఇది నకిలీ సర్టిఫికెట్లకు, అక్రమాలకు తెరతీస్తుంది.**

6. ఇది అనాలోచిత పాలనా? లేక కార్పొరేట్ కుట్రా?

ముఖ్యమంత్రి గారూ, ఇంతటి కీలక విధానపరమైన నిర్ణయం తీసుకునే ముందు విద్యావేత్తలతో అధ్యయనం చేయించాలి, న్యాయశాఖ అభిప్రాయం తీసుకోవాలి, అసెంబ్లీలో చర్చించాలి. కానీ మీరు ఇవేవీ చేయకుండా, **ఒకే ఒక్క సమీక్షా సమావేశంలో 55 ఏళ్ల చరిత్ర ఉన్న ఇంటర్ వ్యవస్థను** రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మీరే నియమించిన **ఆకునూరి మురళి కమిషన్ నివేదికను** కూడా బహిర్గతం చేయలేదు.
విద్యాశాఖను మీ వద్దే ఉంచుకుని, మీరే సుప్రీంకోర్టులో పోరాడి గెలిచిన లోకల్ రూల్‌కు విరుద్ధంగా నిర్ణయం తీసుకున్నారంటే, **ఇది కనీస ముందుచూపు లేని (Without application of mind) పాలనకు నిదర్శనం.**

లేదంటే, ఇది **ముందే రాసుకున్న స్క్రిప్ట్ ప్రకారం జరుగుతున్న కుట్ర.** ఈ నిర్ణయంతో నష్టపోయేది ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే పేద, గ్రామీణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు. లాభపడేది నాలుగేళ్ల ప్యాకేజీలు అమ్ముకునే కార్పొరేట్ విద్యాసంస్థలు.

పైగా, ఆ కార్పొరేట్ సంస్థల్లో ఒక ప్రధాన గ్రూప్ వ్యవస్థాపకుడు, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్నారు. **మన విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి, కార్పొరేట్ కాలేజీలకు రాచబాట వేస్తున్నారన్న బలమైన అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది.**

7. తెలంగాణ ఉద్యమ ఆశయాలకు, అమరుల త్యాగాలకు ద్రోహం

మన స్థానిక హక్కుల పోరాటం **ముల్కీ నిబంధనలతో** మొదలైంది. వందలాది మంది యువకులు ప్రాణాలర్పించిన **1969 ఉద్యమం**, 1973-74 **ఆరు సూత్రాల పథకం, ఆర్టికల్ 371(D)**, 1985లో **జీవో 610**, చివరకు **"నీళ్లు, నిధులు, నియామకాలు"** అనే నినాదంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం: ఇవన్నీ మన బిడ్డల విద్య, ఉద్యోగ హక్కుల కోసమే. మన కాలేజీ సీట్లే మన భవిష్యత్ ఉద్యోగాలకు తొలి మెట్టు.

> ***తెలంగాణ బిడ్డల సీట్లు పరాయి పరం కావద్దని ఆనాడు అమరులు ప్రాణత్యాగం చేశారు. నేడు నాలుగేళ్ల కార్పొరేట్ హాస్టల్ ప్యాకేజీతో బయటివారికి లోకల్ హోదా కట్టబెట్టేలా నిర్ణయం తీసుకోవడం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి, అమరుల త్యాగాలకు తీరని ద్రోహం.***

8. ముఖ్యమంత్రి గారికి నా సూటి ప్రశ్నలు

- 9 నుండి 12 తరగతులను విలీనం చేస్తే తెలంగాణ లోకల్ హోదా నిబంధనలపై ఎలాంటి ప్రభావం పడుతుందో అధ్యయనం చేశారా? దీనిపై **అడ్వకేట్ జనరల్ (AG) న్యాయ సలహా** తీసుకున్నారా? తీసుకుంటే ఆ నివేదికను బహిర్గతం చేయండి.
- ప్రస్తుతం తెలంగాణలోని కార్పొరేట్ రెసిడెన్షియల్ క్యాంపస్‌లలో 9 నుండి 12 తరగతులు చదువుతున్న **ఇతర రాష్ట్రాల విద్యార్థుల సంఖ్య ఎంత?**
- **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన స్థానిక హక్కులను కట్టుదిట్టం చేసుకుంటున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం తన స్వంత బిడ్డల హక్కులను ఎందుకు బలహీనపరుస్తోంది?**

9. నా ప్రధాన డిమాండ్లు

1. **నిర్ణయం ఉపసంహరణ:** ఇంటర్మీడియట్ వ్యవస్థను రద్దు చేస్తూ 11 నవంబర్ 2026న తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకుని, తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డును యథాతథంగా కొనసాగించాలి.
2. **శ్వేతపత్రం విడుదల:** ఈ నిర్ణయంపై అడ్వకేట్ జనరల్ ఇచ్చిన న్యాయ అభిప్రాయాన్ని, లోకల్ హోదాపై పడే ప్రభావాన్ని వివరిస్తూ ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి.
3. **అఖిలపక్షం, ప్రజాభిప్రాయ సేకరణ:** విద్యావ్యవస్థలో ఎలాంటి మార్పులు చేయాలన్నా ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులతో చర్చించాలి.

4. **లోకల్ నిబంధనల కట్టుదిట్టం:** స్థానికత నిర్వచనాన్ని మరింత పటిష్టం చేస్తూ, కనీసం 7 నుండి 10 ఏళ్ల స్థానిక విద్యాభ్యాసం లేదా తల్లిదండ్రుల శాశ్వత నివాసం వంటి నిబంధనలను చేర్చాలి. అవసరమైతే నూతన రాష్ట్రపతి ఉత్తర్వుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.
5. **విజిలెన్స్ తనిఖీలు:** కార్పొరేట్ రెసిడెన్షియల్ క్యాంపస్‌లలో చదువుతున్న ఇతర రాష్ట్రాల విద్యార్థుల వివరాలపై తక్షణమే విచారణ జరిపించి, స్టడీ సర్టిఫికెట్ల జారీపై కఠిన పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.
6. **పారదర్శక ప్రకటన:** కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో ప్రభుత్వ పెద్దలకు గానీ, వారి కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి వ్యాపార, ఆర్థిక సంబంధాలు లేవని బహిరంగ ప్రకటన చేయాలి.

ముఖ్యమంత్రి గారూ,
తెలంగాణ ప్రయోజనాలను, ప్రజల హక్కులను కాపాడతానని మీరు రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేశారు. **మన బిడ్డల భవిష్యత్తు మీ వ్యాపారాలకు ప్రయోగశాల కాదు, కార్పొరేట్ సంస్థల లాభాలకు ముడిసరుకు అంతకంటే కాదు.**

మీరు చేస్తున్న తప్పుడు నిర్ణయం వల్ల, లక్షలమంది తెలంగాణ విద్యార్థులు తమ ఈ గడ్డమీద పుట్టిన బిడ్డలుగా తమకు స్థానికులుగా రావాల్సిన అవకాశాలను కోల్పోతారు. మీరు చేస్తున్న తప్పుకు చరిత్ర మిమ్మల్ని క్షమించదు. తెలంగాణ బిడ్డల హక్కులను కాపాడారా, లేక కార్పొరేట్లకు తాకట్టు పెట్టారా అన్నదాన్ని బట్టే చరిత్ర మిమ్మల్ని అంచనా వేస్తుంది.

శాశ్వత నష్టం జరుగకుండా ఉండాలంటే, మీ ఈ తప్పుడు నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాను. విద్యా ఉద్యోగ అవకాశాలలో అన్యాయానికి గురౌతున్నామనే, ముల్కీ ఉద్యమం నుండి మొదలుకొని, తెలంగాణ సాధించుకునే వరకు అనేక ఉద్యమాలు, త్యాగాలు చేసినం. ఇప్పుడు అనాలోచితంగా, మీ స్వార్థ వ్యాపారాలకోసం తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను వమ్ము చేస్తానంటే మాత్రం, ఊరుకునేది లేదు....
తస్మాత్ జాగ్రత్త!

గౌరవాభివందనాలతో,

డా. దాసోజు శ్రవణ్ కుమార్
శాసనమండలి సభ్యులు (MLC),
భారత రాష్ట్ర సమితి, తెలంగాణ.